



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సజావుగా గ్రూప్-1 పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సజావుగా జరిగాయి. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలను నిర్వహించారు. పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ బాలాజీ పీజీ కాలేజీలో 594 విద్యార్థులకు గాను 389 పరీక్షలకు హాజరయ్యారు. 205 మంది గైర్హాజరయ్యారు. అనంతపురం నగరం సమీపంలోని సనప రోడ్డు రుద్రంపేట వద్ద ఉన్న శ్రీ బాలాజీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీటి వసతితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండే విధంగా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, అనంతపురం రూరల్ తహశీల్దార్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపిలో సంస్థాగత మార్పులు..!

- కొన్ని స్థానాల్లో సమన్వయకర్తలను మార్చే యోచన
- ఇప్పటికే శింగనమలకు శైలజానాథ్
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మార్పులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఘోరమైన ఓటమిని చవిచూసిన తరువాత వైసిపి పార్టీలో కొన్ని మార్పులు చేపట్టేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది. ఇప్పటికే అనుబంధ సంఘాల్లో మార్పులు చేస్తూ కొత్త కమిటీల ఏర్పాటు చేపడుతోంది. అదే సమయంలో కొన్ని చోట్ల నియోజకవర్గ సమన్వయకర్తల మార్పులు కూడా చేపట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త మార్పు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వీరాంజినేయులు రాజకీయాలకు దూరంగా ఉండి సొంతపనులు చేసుకుంటున్నారు. ఇక ఆ నియోజకవర్గంపై పట్టున్న ఆలూరు సాంబశివారెడ్డి ని కాదని కాంగ్రెస్ పార్టీ నుంచి ఇటీవల వైసిపిలో చేరిన మాజీ మంత్రి సాకే శైలజనాథ్‌ను శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఇదే తరహాలో కొన్ని నియోజకవర్గాల్లో మార్పులు చేపట్టే ఆలోచనలోన్నుట్టు తెలుస్తోంది. కదిరి, రాయదుర్గం, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఇది వరకున్న సమన్వయకర్తలు ఇప్పుడు యాక్టివ్‌గా లేరు. స్థానిక నాయకులే ఎవరూ లేకున్నా కార్యక్రమాలు చేసుకుని పోతున్నారు. ఇక పార్లమెంటుకు పోటీచేసిన వారిలోనూ శంకర నారాయణ అనంతపురానికి పోటీ చేశారు. ఆయన సత్యసాయి జిల్లా వైపే మొగ్గుచూపుతున్నారు. గతంలో ఆయన సిట్టింగ్ స్థానమైన పెనుకొండ వైపు మొగ్గు చూపుతున్నారు. అక్కడ ఇప్పుడు సమన్వయకర్తగా ఉన్న ఉషశ్రీచరణ్‌కు శంకర నారాయణకు మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శంకర నారాయణను హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్తగా మార్చే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అక్కడ పార్లమెంట్‌కు పోటీ చేసిన శాంతమ్మ ఎన్నికల తరువాత నుంచి పూర్తిగా కనుమరుగయ్యారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆమె బళ్లారి నుంచి వచ్చి పోటీ చేశారు. ఆమె ఓటమి తర్వాత తిరిగి బళ్లారికే పరిమితమయ్యారు. దీంతో శంకర నారాయణను పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించడం ద్వారా ఈ లోటును భర్తీ చేసే ఆలోచన నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇక అనంతపురానికి మరో నాయకుడిని నియమించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక నియోజకవర్గాల్లో చూస్తే రాయదుర్గం సమన్వయకర్త మెట్టుగోవిందరెడ్డి యాక్టివ్‌గా లేరు. పైగా ఒక గ్రూపు ఆయన్ను వ్యతిరేకిస్తోంది. అక్కడ కొత్త వారికి తీసుకొస్తే బాగుంటుందని జిల్లా నేతలు భావిస్తున్నట్టు సమాచారం. కదిరి మక్బుల్ బాషా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవలే ఆ పార్టీలోని తక్కిన నేతలు సమావేశమై ఎవరో ఒకరిని నియమించాలని కోరినట్టు తెలుస్తోంది. పుట్టపర్తికి మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూడా నియోజకవర్గ కార్యక్రమాల్లో కనిపించడం లేదు. మడకశిర పరిస్థితి అదే రకంగా ఉంది. ఎన్నికల్లో పోటీ చేసిన ఈరలక్కప్ప పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గాలేరు. ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త వారిని తీసుకొచ్చే ఆలోచనలో వైసిపి అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. రాబోయేది స్థానిక సంస్థల ఎన్నికల సమయం కాబట్టి అంతలోపు కొత్త నాయకత్వాన్ని దింపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ఆలోచన వైసిపి అధష్టానం చేస్తున్నట్టు తెలుస్తోంది.



మొండి బకాయిలపై చర్యలు : డిపిఒ



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ నాగరాజునాయుడు

అనంతపురం : ఇంటి పన్ను మొండి బకాయిదారులు వారంలోపు పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని డిపిఒ టి.నాగరాజునాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అనంతపురం రూరల్ మండలంలోని మేజర్ పంచాయతీ సెక్రటరీలతో ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న మొండి బకాయిలను వారంలోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నాడు. లేనిపక్షంలో నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇంటి పన్నుల పెండింగ్ వసూలుకు ప్రతి 15 రోజులకు ఒకసారి పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి సమీక్షించనున్నట్లు తెలిపారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, ఎవరైనా లింగ నిర్ధారణ చేస్తుంటే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పిసి, పిఎన్‌డిటి యాక్ట్ (గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం), ఏఆర్టీ సరోగసి యాక్ట్‌కు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం కింద ఫిర్యాదుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంబంధించిన పోస్టర్లను తయారు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఎన్ని ఫోన్ కాల్స్ వచ్చాయన్న దానిపై నివేదిక ఇవ్వాలన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీకి సంబంధించి మండల, గ్రామాల వారీగా నివేదికలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని బాలికల కళాశాలల వద్ద బీట్ పాయింట్ ఏర్పాటు చేసుకుని గస్తీ చేసే పోలీసులు తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ టీనేజ్ ప్రెగ్నెన్సీ నమోదయిందో అక్కడ హెల్త్, ఐసిడిఎస్ అధికారులు ఫ్యామిలీ కౌన్సిలింగ్ చేయించాలన్నారు. కర్ణాటక చిత్రదుర్గ, బళ్ళారి, చెల్లికెర తదితర ప్రాంతాల్లో డెకాయ్ ఆపరేషన్లు చేయాలని, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఎన్జీవోలు, పోలీసులు సంయుక్తంగా దళారులను గుర్తించి లింగ నిర్ధారణ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు బాలికల కళాశాలల్లో లింగ నిర్ధారణ నేరం అనే పోస్టర్లను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. క్షేత్రస్థాయిలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్లు గట్టిగా పని చేయాలని, పనిచేయడంలో అడ్డంకి పెడితే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో 1వ ఎడిజె సత్యవాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥ఈబి.దేవి, డాక్టర్ పార్వతి, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డా.దుర్గేష్, రెడ్స్ భానుజ, డీఎస్పీ మహబూబ్ బాషా, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఈవో గంగాధర్, ఆశారాణి, హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

జిఎస్‌డబ్ల్యుఎస్ పెండింగ్ అంశాలపై దృష్టి సారించండి

జిఎస్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించి పెండింగ్ అంశాల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిఎస్‌డబ్ల్యుఎస్, ఇతర అంశాలపై ఆర్డీవోలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు, డిఎల్‌డిఒలు, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిఎస్‌డబ్ల్యుఎస్ పరిధిలో మనమిత్ర క్యాంపెయిన్‌ను పూర్తి చేయాలన్నారు. సిటిజన్ ఈకేవైసీకి సంబంధించి రోజు పదివేలు పూర్తి చేయాలని, పీపుల్ వర్కింగ్ ఫ్రొం హోమ్‌కి సంబంధించి లక్ష్యానికి అనుగుణంగా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. డెత్ మార్క్ సిటిజన్ పెండింగ్ వేగంగా చేపట్టాలని, మిస్సింగ్ సిటిజన్ ఫర్ హౌస్ హోల్డ్, ఏపీ సేవా సర్వీసెస్ పెండింగ్‌ని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఏపీజేఏవై కింద ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్స్ పెండింగ్ లేకుండా పూర్తిచేసేలా చూడాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డా॥ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, పిజిఆర్ఎస్ తహశీల్దార్ వాణిశ్రీ, జిఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిహెచ్‌ఒల న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. గత నెల 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సిహెచ్‌ఒ (ఎంఎల్‌హెచ్‌పి)లు సమ్మె చేస్తున్నారు. వీరికి సమ్మెకు సిఐటియు మద్దతు తెలిపింది. శనివారం నాడు అనంతపురం సర్వజన ఆస్పత్రి వద్ద సమ్మె చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగులను సిఐటియు నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని సిమెచ్‌ఒల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చెయ్యకుండా వివక్ష చూపడం సరికాదన్నారు. 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు జరిగేదన్నారు. గత 15 ఏళ్లుగా అమలైన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. దీని వల్ల ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు హ్యూమన్ రీసోర్స్ పాలసీని అమలు చేయాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎంఎల్‌హెచ్‌పిల వేతన పెంపు, హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సెంటీవ్ బకాయిల చెల్లింపు, ఈపీఎఫ్ తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంఎల్‌హెచ్‌పి సంఘాల ప్రతినిధులందరితో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ, నగర కార్యదర్శి ముత్తుజా, అంబులెన్స్ డ్రైవర్ యూనియన్ జిల్లా నాయకులు బాషా పాల్గొన్నారు.



సిహెచ్‌ఒల ఆందోళనకు మద్దతుగా మాట్లాడుతున్న నాగేంద్రకుమార్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

కెఎస్ఎన్ కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారం

అనంతపురం : ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నగరంలోని కెఎస్ఎన్ కళాశాలలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గత సోమవారం కెఎస్ఎన్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం తెలిసిందే. తనిఖీలో భాగంగా విద్యార్థినులు తాగునీటి సమస్య అధికంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించి నాలుగు రోజుల్లోనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో విద్యార్థినులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీటీ సేవలకు విఘాతం కలిగించొద్దు

ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే పునరుద్ధరించాలి

ఆర్‌డిటి పరిరక్షణ ఫోరం డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సేవలకు విఘాతం కలిగించకుండా యథావిధిగా ఆ సంస్థ ద్వారా అన్ని సేవలూ పేదలకు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆర్డీటీ పరిరక్షణ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరద్ధురించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీటీ పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో శనివారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ప్రజా, కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీటీని పరిరక్షణే ధ్యేయంగా ఫోరంను ఏర్పాటు చేశారు. సీనియర్ పాత్రికేయులు మచ్చ రామలింగారెడ్డి, సమన్వయకర్త సీనియర్ జర్నలిస్ట్ రవిచంద్ర అధ్యక్షతన సంఘాలన్ని కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎను ఆపడం వల్ల ఉమ్మడి జిల్లాలో పేదలు ఆర్డీటీ సేవలకు దూరం అయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై పునరాలోచించి అర్డీటీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. లేకుంటే ఆర్డీటీ కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్, సీనియర్ జర్నలిస్టు సందనం రవికుమార్, ఎమ్మార్పీఎస్ డా॥ కెబి.సామ్రాట్ మధు, ఏపీ రైతుసంఘం బిహెచ్ రాయుడు, ఐఎంఎం మహబూబ్ బాషా, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సాకే హరి, ఏపీ కౌలు రైతు సంఘం బాల రంగయ్య, ప్రజాశక్తి మురళి, సిఐటియు రామాంజనేయులు, ఎన్జీవో సెక్రటరీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఆర్డీటీ పరిరక్షణ ఫోరం నేతలు

ఆలోచింపజేసిన అంబేద్కర్ జీవిత చరిత్ర

ప్రజాశక్తి -అనంతపురం

అంబేద్కర్ జీవిత చరిత్ర ఇతివృత్తంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన సంఘం శరణం గచ్ఛామి నాటకం ఆలోచింప చేసేదిగా సాగింది. శనివారం సాయంత్రం కె వి పి ఎస్ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన జరిగింది .నగరంలో లలిత కళాపరిషత్ డ్రామా హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అంబేద్కర్ బాల్యం లో వివక్ష ను ఏ రకంగా ఎదుర్కొన్నారు ఆయన విద్యాభ్యాసం ఏ విధంగా సాగింది అన్న అంశాలతో ఈ ప్రదర్శనలో కళ్లకు కట్టినట్టు చూపించారు.అంతే కాకుండా విదేశాల్లో విద్యాభ్యాసం కొనసాగించే సమయంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను ఈ నాటకంలో ప్రదర్శించారు. విద్యాభ్యాసం అనంతరం భారతదేశానికి వచ్చాక అంటరానితనం రూపుమాపడంలో ఆయన చూపిన కృషిని కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. స్వాతంత్ర అనంతరం రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను తెలియజేసే విధంగా ఈ నాటక ప్రదర్శన సాగింది. అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు చేపట్టిన ఈ ప్రదర్శన అందరిని ఆలోచింపజేసేదిగా ఉంది. పెద్ద ఎత్తున నగరవాసులు ఈ ప్రదర్శనను తిలకించారు. ఇంతటి చక్కటి ప్రదర్శన చేపట్టిన కళాకారులకు అందరూ అభినందించారు .ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప కెవిపిఎస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న అభ్యుదయ ఆర్ట్స్ కళాకారుల ప్రదర్శన



నాటకాన్ని ప్రదర్శిస్తున్న అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు

అకాల వర్షానికి అపారనష్టం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు పండ్ల తోటల రైతులకు అపార నష్టం కలిగింది. మండల పరిధిలోని చెదుల్ల, జంతలూరు, కొర్రపాడు, కెకె అగ్రహారం, రోటరీపురం, దండువారిపల్లి, తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన మామిడి, అరటి, బొప్పాయి వంటి పంటలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఉద్యానవన అధికారిణి శైలజ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చెంద్రాయునిపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మామిడి పంట 20 (ఎకరాల్లో), అరటి 100, బొప్పాయి 10 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఈదురు గాలులు, వర్షానికి కూలిన చెట్లు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని రామ్‌నగర్ 2వరోడ్డు ఎర్రనేల కొట్టాల, కోవూరు నగర్, తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి చెట్లు నేలకూలాయి. ముఖ్యంగా 2వ రోడ్డులో పార్కులోని ఓ చెట్టు ఈ-సేవా కేంద్రానికి పక్కన ఉన్న గుడిసెపైకి వాలింది. అయితే కాంపౌండ్ వాల్ అడ్డుగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. కాగా శనివారం నగరంలోని పలుప్రాంతాల్లో మేయర్ మహమ్మద్ వసీం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కూలిన చెట్లను తొలగించడంతోపాటు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ వైర్లను తొలగించి మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహించింది. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగించాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్ నరసింహ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్, కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, లాలూ, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం మండలంలో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు



ఎమ్మెల్యే దగ్గుపాటికి బొకేలు అందజేస్తున్న ఎడిసిసి, డిసిఎంఎస్ ఛైర్మన్లు

ఎమ్మెల్యేలను కలిసిన ఎడిసిసి, డిసిఎంఎస్ ఛైర్మన్లు

ప్రజాశక్తి-అనంతపురం/అనంతపురం రూరల్

ఎడిసిసి బ్యాంకు నూతన ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్ అనంతపురంలోని నివాసాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీతను వేర్వేరుగా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా వారికి బొకేలు అందజేసి సన్మానించారు. అనంతరం వారిద్దరికీ ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం గత కొన్నేళ్లుగా కష్టపడి పని చేసిన కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్‌కు ఛైర్మన్ పదవులు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, తదితరులు పాల్గొన్నారు.



పరిటాల సునీతకు బొకే అందజేస్తున్న ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిఐటియు

బొమ్మనహాళ్ : గాలివానకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిఐటియు మండల కమిటీ నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలుకు మండల కేంద్రంతోపాటు దేవగిరి, కొళగానహళ్లి, లింగదహాల్, ఉద్దేహాల్, మైలాపురం, కృష్ణాపురం, కురవల్లి గ్రామాల్లో దాదాపు 5వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందన్నారు. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, మామిడి, సపోట, బొప్పాయి, అరటి, తదితర పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనాలను రూపొందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జెఎన్‌టియు విసితో ఆర్‌అండ్‌బి అడ్మినిస్ట్రేషన్ చీఫ్ భేటీ




జెఎన్‌టియు విసిని సన్మానిస్తున్న రోడ్లు, భవనాల శాఖ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ నయముల్లా

అనంతపురం : రోడ్లు, భవనాల శాఖ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ నయముల్లా శనివారం స్థానిక జెఎన్‌టియులో ఉపకులపతి హెచ్.సుదర్శనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం జెఎన్‌టియులో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. జెఎన్‌టియు అభివృద్ధికి ఏ అవసరం వచ్చినా తమవంతు సహకారం అందిస్తామని నయముల్లా పేర్కొన్నారు.

మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల బీమా

ప్రజాశక్తి-అనంతపురం



బీమా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టిడిపి కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల బీమా సాయం అందింది. నారాయణపురం పంచాయతీలోని సుఖదేవ్ నగర్‌కు చెందిన నర్సింహులు రెండు నెలల క్రితం ద్విచక్ర వాహనంలో వెళుండగా ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. నరసింహులు అంతకు రెండు నెలల క్రితమే టిడిపి సభ్యత్వ నమోదు రెన్యూవల్ చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బాధిత కుటుంబానికి బీమా వచ్చేలా చొరవ తీసుకున్నారు. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో మృతుడు నరసింహులు భార్య సరోజకు రూ.5లక్షల బీమా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొనంకి గంగారామ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, టిడిపి నాయకులు జయప్రకాశ్ యాదవ్, హాజీవలి , వడ్డే హరి, రాంబాబు, వెంకట రాముడు, కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తదితరులు పాల్గొన్నారు.

5న ధర్నాకు తరలిరండి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-రాయదుర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5వతేదీన పాత తాలూకా కేంద్రాల వద్ద జరగనున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.రామ కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో జరిగిన ప్రభుత్వ విధానాలని కొనసాగిస్తూ విద్యారంగంలో గందరగోళ పరిస్థితులను సృష్టించారన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ 5న పాత తాలూకా కేంద్రాల వద్ద, 9న జిల్లాకేంద్రాల్లో, 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా నిరసనల్లో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గుమ్మగట్ట మండల బాధ్యులు పాండు, సిద్దేశ్వర, రాయదుర్గం నాయకులు కె.రామాంజనేయులు, సునీల్, మల్లికార్జున, తిప్పేస్వామి, నాయకులు అనిల్‌కుమార్, ఖాసీం, రజాక్, తదితరులు పాల్గొన్నారు.



తెగిపడిన విద్యుత్ లైన్

తెగిపడిన విద్యుత్ లైన్

పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

పుట్లూరు : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు ఎల్‌టి విద్యుత్ లైన్ తెగి కింద పడింది. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. విద్యుత్ లైన్ పడిపోయిన కారణంగా శుక్రవారం రాత్రి నుంచి ఉదయం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో మండల కేంద్రంతోపాటు నాగిరెడ్డిపల్లి, తక్కల్లపల్లి, గాండ్లపాడు, పోతిరెడ్డిపల్లి, తిమ్మాపురం, ఎస్.గూడూరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పంచాయతీల్లో తాగునీటి సమస్య రానివ్వం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కూటమి ప్రభుత్వం వచ్చాకే అనంతపురం జిల్లాలో తాగునీటి పథకం పనులు వేగవంతంగా సాగుతున్నాయని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇవాళ అనంతపురం నియోజకవర్గ పరిధిలోని తపోవనంలోని శివాలయం వద్ద జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిజెపి జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా తపోవనానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ కార్యక్రమంలో అట్టహాసంగా సాగింది. జిల్లాలోని రాప్తాడు, అనంతపురం రూరల్, అర్బన్ నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీలకు పీఏబీఆర్ ద్వారా తాగునీరు అందించేందుకు రూ.97 కోట్లతో ఈ పనులు చేపట్టారు. నాలుగు పంచాయతీలకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాగునీటి పథకం పనులు ఎక్కడికి అక్కడ ఆగిపోయాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక ఈ పది నెలల కాలంలోనే అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఇప్పుడు పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు మీదుగా అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. మరో రెండు మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేసి ప్రజలకి నీరందిస్తామని స్పష్టం చేశారు. దీంతోపాటు అనంతపురం నగరానికి మరో 60 ఎంఎల్‌డి వాటర్ ప్లాంట్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఇది కూడా దాదాపుగా పూర్తైందని మరో 20 రోజుల్లో మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా దీనిని ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతోనే ఈ పనులన్నీ వేగవంతంగా సాగుతున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్‌రావు, అనంతపురం ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ హరికుమార్, అనంతపురం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కొండన్న, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, టిడిపి నాయకులు రఘునాథ్, ఓబుళపతి, కొత్తపల్లి రవీంద్ర, టైలర్ శీన, కృష్ణం రఘు, ఈడిగ నాగభూషణం, జయప్రకాష్ యాదవ్, వడ్డే హరి, సికిందర్ మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, శోభ, మాధవి, అశ్విని, తెలుగుదేశం, బిజెపి, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రా అంటే అమరావతి ఒక్కటే కాదు..

అప్పులు తెచ్చి అమరావతిలో పెట్టడం తగదు-మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-అనంతపురం



విలేకరులతో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

ఆంధ్రా అంటే ఒక్క అమరావతి మాత్రమే కాదని.. ఉత్తరాంధ్ర, రాయలసీమ కూడా రాష్ట్రంలో భాగమనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించుకోవాలని మాజీమంత్రి సాకే శైలజానాథ్ తెలిపారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పులన్నీ తెచ్చి అమరావతిలో పెట్టడం తగదన్నారు. అమరావతికి కృష్ణానది ముంపు ప్రమాదం పొంచి ఉందన్నారు. నిజంగా ఆ భయం లేకపోతే దాదాపు రూ.1100 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాలు ఎందుకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. 5 లిప్ట స్కీమ్‌లు చేపట్టకపోతే, అమరావతి నిర్మాణానికి రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు హెచ్చరించాయని గుర్తు చేశారు. దేశంలో జాతీయ రహదారులను కిలోమీటర్‌కు రూ.20 కోట్లతో నిర్మిస్తుంటే, రాజధాని అమరావతిలో మాత్రం కిలోమీటర్ రోడ్డుకు ఏకంగా రూ.59 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. పైగా ఆ పనుల కాంట్రాక్టులన్నీ టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో తమ వారికే కట్టబెట్టడం బాధాకరమన్నారు. మరోవైపు ఊరూ పేరూ లేని ఉర్సా కంపెనీకి విశాఖలో దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన భూమిని కట్టబెడుతున్నారన్నారు. ఏడేళ్ల కిందట అమరావతిలో ఐకానిక్ టవర్లు, ఆకాశహర్మ్యాలు, సీ ప్లేన్, నది మీద హ్యాంగింగ్ బ్రిడ్జి అంటూ గ్రాఫిక్స్‌తో ప్రచారం చేసి ఊదరగొట్టారన్నారు. ఐదేళ్లు గడిచాక చూస్తే అమరావతిలో తాత్కాలిక హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ తప్ప వేరే నిర్మాణాలు కనిపించలేదన్నారు. అమరావతి కోసం రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాల భూమిని బీడు పెట్టేశారన్నారు. ఇప్పుడు మళ్లీ మరో 44 వేల ఎకరాలు సేకరిస్తానని మంత్రి పి.నారాయణ చెబుతుండటం విశేషమన్నారు. బస్టాండ్ కట్టడానికే నిధులు లేవని చెప్పే చంద్రబాబు, విజయవాడలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పెట్టుకుని మళ్లీ అమరాతిలో విమానాశ్రయం కడతామని డాబు మాటలు చెప్పడం బాధాకరమన్నారు. 11 నెలల్లో రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. కమీషన్ల కోసం, తమ వారి జేబులు నింపేందుకు అమరావతి అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.44 వేల కోట్ల నుంచి రూ.77వేల కోట్లకు పెంచేశారన్నారు. కమీషన్లు తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని నాడు వైఎస్ జగన్ తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్, జుడీషియల్ ప్రివ్యూ విధానాలను చంద్రబాబు రద్దు చేశారన్నారు. కొత్తగా మొబిలైజేషన్ విధానం తీసుకొచ్చి, కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ కిందకు 10 శాతం నిధులు ఇచ్చి, అందులో నుంచి 8 శాతం కమిషన్ల కింద వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు ఒక్క రాజధానినే కాకుండా రాష్ట్రం మొత్తాన్ని పట్టించుకోవాలని హితవు పలికారు.

ఉగ్రదాడికి నిరసన

బెలుగుప్ప : పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని రేషన్ షాప్ నెంబర్-1 డీలర్ పార్వతి, శివప్రసాద్, ఎండియు రాజేష్ ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బాబురెడ్డి, సంజీవప్ప, అశోక్, శివరుద్ర, భీమన్న, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

శైలజానాథ్‌ను కలిసిన వైసిపి నాయకులు



శైలజానాథ్‌కు బొకే అందజేస్తున్న శింగనమల నాయకులు

శింగనమల : నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన సాకే శైలజానాథ్‌ను శనివారం అనంతపురంలో మండల వైసిపి నాయకులు మర్యాద పూర్వకంగాకలిశారు. ఇందులో భాగంగా బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు నూర్ మహమ్మద్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, వైసిపి నాయకులు బండి శ్రీనివాసులు, జిల్లా యువజన విభాగం కార్యనిర్వహ సభ్యుడు జెల్లి గోపీయాదవ్, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పీజీ నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



శైలజానాథ్‌తో బుక్కరాయసముద్రం నాయకులు

బుక్కరాయసముద్రం : వైసిపి నాయకులు, మాజీమంత్రి సాకే శైలజానాథ్‌ను శనివారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శైలజానాథ్ వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అందరం కష్టపడి పని చేస్తేనే పార్టీ అధికారంలోకి వస్తుందని సూచించారు. శైలజానాథ్‌ను కలిసిన వారిలో బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, సీనియర్ నాయకులు పూల నారాయణస్వామి, తదితరులు ఉన్నారు.

నార్పలలో సీసీ కెమెరాలు ఏర్పాటు

నార్పల : మండల కేంద్రంలోని 14 ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, క్రాసింగ్, దుగుమర్రి రోడ్డు తదితర కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పోలీస్‌స్టేషన్‌లో పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎక్కడైనా చోరీలు, ఘర్షణలు, అల్లర్లకు పాల్పడటంతోపాటు రోడ్లపైన అత్యంత వేగంగా ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

కౌలు రైతుసంఘం నూతన కమిటీ ఎన్నిక

ఉరవకొండ : మండల పరిధిలోని రేణుమాకులపల్లి గ్రామంలో శనివారం నూతన కౌలు రైతు సంఘాన్ని ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు తెలిపారు. అధ్యక్షులుగా సురేష్, ఉపాధ్యక్షులుగా నారాయణస్వామి, కార్యదర్శిగా వన్నూరుస్వామి, కమిటీ సభ్యులుగా ఎర్రలింగప్ప, హనుమంతు, లింగరాజు, ఎన్నప్ప, ఈరయ్య, పెద్ద తిప్పయ్య, చిన్న లింగమయ్య, మనోజ్, నగేష్, కంచన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశులు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కౌలు రైతుల సమస్యలను గుర్తించి వారిని ఆదుకోవాలన్నారు.

సబ్సిడీ డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోండి

బెలుగుప్ప : పండ్ల తోటల రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ సూచించారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులు ఏర్పాటు చేసుకున్న డ్రిప్పు పరికరాలను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీతో, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

కిశోర బాలికలకు వేసవి శిక్షణ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాలవెంకటాపురం పంచాయతీ మామడూరూ గ్రామంలో శనివారం కిషోరి వికాసంపై వేసవి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబి అవగాహన కల్పించారు. ఇందులోఉ భాగంగా ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, హ్యూమన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100, సైబర్ నేరాల హెల్ప్‌లైన్ 1930పై బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, వరలక్ష్మి, జమున, ఆశా కార్యకర్తలు, కిషోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు విమాన ప్రయాణం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సొంత ఖర్చులతో విమానయాన ప్రయాణం చేయించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పెద్దవడుగూరు, కోనాపురం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతోపాటు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు దిమ్మగుడి చంద్రిక, లక్షుంపల్లి యువలక్ష్మి, చిత్రచేడు అవినాష్, పెద్దవడుగూరు అనూషా, హరీష్, కిష్టిపాడు అల్తాప్, కెజిబివి శృతి, వీరన్నపల్లి శృతిని ఈనెల 10న కడపకు తీసుకెళ్లి అక్కడి నుంచి విమానంలో విజయవాడకు వెళ్లనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సొంతనిధులు వెచ్చించి వీరిని విమాన ప్రయాణం చేయించడంతోపాటు విజయవాడ, అమరావతిలోని పలు ప్రదేశాలను తిలకించి తిరిగి ఇళ్లకు పంపించనున్నట్లు రమేష్‌బాబు తెలిపారు.

సచివాలయాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి

యల్లనూరు : మండల పరిధిలోని చింతకాయ మంద-1 సచివాలయాన్ని ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వేపై సచివాలయ సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు.

ఆపన్న హస్తానికే ఆపద..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం జిల్లాలో ఎవరికి కష్టమెచ్చినా ముందుగా చూసేది ఆర్డీటీ సంస్థ వైపే. ఏదైనా అక్కడి నుంచి సహాయమందుతుందన్న నమ్మకం అంతగా సామాన్యుల్లో ఉండేది. ఆ సంస్థ కూడా 1969వ సంవత్సరం నుంచి ప్రజల్లో పనిచేస్తూ వస్తోంది. నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఎంతోకొంత తోడ్పాటు, సహకారాన్ని సామాన్యులకు అందిస్తూ వస్తోంది. కరువు నుంచి సామాన్యులను గట్టెక్కించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వాటర్‌షెడ్ల నిర్మాణంతో మొదలైన ఆ సంస్థ అనేక రంగాల్లో సేవలందిస్తూ వచ్చింది. మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఆటలు ఇలా వివిధ రంగాల్లో సేవలందిస్తూ రావడంతో ఈ జిల్లావాసులతో ఆ సంస్థ అనుబంధం అంతగా ఏర్పడింది. ఈ సుదీర్ఘ కాలంలోనూ ఎక్కడా ఎటువంటి వివాదాల్లోకి సైతం పడకుండా అతి జాగ్రత్తగా స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తూ వచ్చారు. అందుకే ఆ సంస్థ అంటే సామాన్యులు, పేదల్లో అంతటి నమ్మకమం ఏర్పడింది. అటువంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం కత్తికట్టినట్టుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. గతేడాదే ఈ సంస్థకు వచ్చే విరాళాలపై వేటు వేసింది. ఇప్పుడు ఏకంగా సంస్థపైనే వేటుకు సిద్ధపడినట్టు కనిపిస్తోంది. ఈ వారంలో ఆ అంశం జిల్లాలో అందరినీ ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఏకంగా సేవ్ ఆర్డీటీ పేరుతో ఉద్యమాన్ని ప్రారంభించారు. ఒకవైపు అఖిలపక్షంలోనూ అందరూ ఒకటే నినాదాన్ని వినిపించారు. ప్రజా సంఘాలు ఒక ఐక్య కార్యాచరణను రూపొందించి ప్రభుత్వానికి విజ్ఞాపనలు పంపించారు. అధికారపార్టీ నేతలందరూ కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆ సంస్థ వల్ల ఎంతోకొంత ప్రయోజనం జిల్లాకు చేకూరుతోందని వివరించారు. బిజెపి మంత్రి సత్యకుమార్ కూడా తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటికీ ఎటువంటి స్పందనా కనిపించలేదు. రెన్యూవల్‌కు అవసరమైన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. రెన్యూవల్ ఆగిపోవడంతో నిధులు వ్యయం చేయకపోవడంతో సంస్థ సాధారణ కార్యకలాపాలకు కూడా ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా వైద్యం అందించే ఆసుపత్రుల్లో సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కరువు ప్రాంతవాసులకు కల్పతరువుగానున్న ఆర్డీటీకి ఏర్పడిన చిక్కులను తొలగించాలని జిల్లావాసులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలో జిల్లాలో ఎండలు, వానలు ప్రభావం చూపాయి. ఒకవైపు ఎండ తీవ్రత పెరుగుతుండగా, మరోవైపు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. వేసవిలో నెలకొన్న ఈ వాతవరణంతో జనం అల్లాడిపోతున్నారు. గాలుల దెబ్బకు పంటలు దెబ్బతింటున్నాయి. మామిడి. అరటి, బత్తాయి తదితర పంటలు చేతికొచ్చిన సమయంలో వాతావరణంలోని ఈ మార్పులు రైతులకు తీరని నష్టాని మిగులుస్తున్నాయి. అనూహ్యమైన వాతావరణ మార్పు అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

5న ఉద్యోగ మేళా

అనంతపురం : ఈనెల 5వతేదీన నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ, జెకెసి సమన్వయకర్త తాళంకి జీవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో డాక్టర్ రెడ్డీ ఫౌండేషన్, కియా, అమేజాన్, జోయలుక్కాస్ వంటి సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

50శాతం సబ్సిడీతో పశువుల దాణా

గుమ్మఘట్ట : పశువులు కలిగిన రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా ఇస్తున్నట్లు పశు వైద్యాధికారి పి.నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 కిలోల దాణా బస్తా రూ.1150 కాగా సబ్సిడీ పోను రూ.588కు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పాడి పశువులు కలిగిన రైతులకు 50శాతం సబ్సిడీతో పశువుల దాణా అందజేస్తున్నట్లు పశువైద్యాధికారి నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పుట్లూరు : ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 8వ తేదీ వరకూ పుట్లూరు, కడవకల్లులో, 12, 13వతేదీల్లో బాలాపురం, అరకటివేముల, 14, 15వ తేదీల్లో తక్కల్లపల్లి, అరకటివేముల సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుమ్మగట్ట : మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 5వతేదీ నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 12 నుంచి 15వ తేదీ వరకూ గుమ్మఘట్ట మండలంలోని 75 వీరాపురం, గుమ్మఘట్ట గ్రామ సచివాలయంలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

రాప్తాడు : నియోజకవర్గానికి చెందిన 30మంది లబ్దిదారులకు మంజూరైన రూ.36 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి, రాప్తాడు మండల కన్వీనర్ కొండప్ప, టిడిపి కార్యకర్త రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు : మండలంలోని తాడిపత్రి-యల్లనూరు రహదారిలో ఎస్ఐ రామాంజనేయరెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి రికార్డులు లేని వాహనాలకు అపరాద రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్ల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన ఎన్‌సిసి క్యాడెట్లను అనందిస్తున్న ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు కర్నూలులో జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన ఎన్‌సిసి క్యాడెట్లు అరవింద్, వంశీ, ఆసియా భాను, గౌతమి, లీలావతిని శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌సిసి ఎఎన్ఒ కిరణ్, అధ్యాపకులు ఫరీసాఫిర్దోష్, సునీల్, బాల నరసింహులు, బాబు, నారాయణ, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ భర్త సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని ట్రస్టు సభ్యులు శారద, కుమార్తెలు బిందు, మాధవి, మాధురి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ట్యాంకు పైనుంచి పడి వాల్వ్ ఆపరేటర్‌కు గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాల్వ్ ఆపరేటర్ తిరుమల్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని ఆర్‌కెనగర్‌లో వాల్వ్ ఆపరేటర్ తిరుమల్‌రెడ్డి వాటర్ ట్యాంక్ శుభ్రం చేయడానికి లోపలికి దిగుతుండగా మెట్లు కూలి కింది పడి శనివారం గాయపడ్డాడు. కాలు చిన్నపాటి గాయం కావడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ కార్మిక సంఘం నేతలు మల్లికార్జున, సంజీవరాయుడు, సుబ్బిరెడ్డి, పోతులయ్య, మురళి, గౌరీ శంకర్, లోకేష్, పోతులయ్య, తదితరులు తిరుమల్‌రెడ్డిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వాటర్‌వర్క్స్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని వైద్య ఖర్చులకు రూ.10వేలు అందజేశారు. ఇందుకు ఇంజినీరింగ్ సిఐటియు నాయకులు జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, జిల్లా కార్యదర్శి విఎస్ రాయుడు, నగర అధ్యక్షులు మురళీమోహన్, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌కి చెందిన అవినాష్ హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే కరిడికొండ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆలయంలో చోరీ



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పుట్లూరు : మండల పరిధిలోని గరుగు చింతలపల్లి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. చోరీలో వెండి కిరీటాలు, వెండి నామాలు, వెండి మీసాలు, వెండి కళ్లు చోరీకి గురైనట్లు పూజారి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా వస్తువుల విలువ రూ.19,500 ఉంటుందన్నారు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్ ద్వారా విచారణ చేపట్టారు.

మొక్కజొన్న పంటకు నిప్పు



దగ్ధమైన మొక్కజొన్న పంట

పెద్దవడుగూరు : మండలంలోని మల్లేనిపల్లిలో పరమేశ్వరాచారికి చెందిన మొక్కజొన్న పంటకు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. తనకున్న రెండెకరాల పొలంలో మామిడి మొక్కలతోపాటు పెంపకంతోపాటు అంతర పంటగా మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోతదశలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంటతోపాటు మామిడి మొక్కలు దగ్ధమయ్యాయన్నారు. దీంతో సుమారు రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.